# జేఎన్‌టీయూ-జర్మన్ బీటెక్‌లో అడ్మిషన్ల ప్రక్రియ షురూ

హైదరాబాద్ సిటీ, మే6 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ-జర్మనీ యూనివర్సిటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్ అండ్ మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఐబీఎంపీ)లో అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. జర్మనీలోని రౌట్లింగన్ యూనివర్సిటీ, క్యాసెల్ యూనివర్సిటీలతో పలు బీటెక్, ఎంఎస్ డిగ్రీల నిమిత్తం గతేడాది జేఎన్‌టీయూ ఎంఓయూ కుదుర్చుకుంది. ఐదేళ్ల ఐబీఎంపీ, రెండేళ్ల ఎంఎస్ కోర్సులపై అవగాహన కోసం బుధవారం అడ్మిషన్ల విభాగంలో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేసినట్లు ఇండో-యూరో సింక్రనైజేషన్ సంస్థ ఎండీ రాజ్ వంగపండు తెలిపారు. ఆసక్తికల విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రతి బుధ, శనివారాల్లో యూనివర్సిటీ క్యాంపస్‌లోని హెల్ప్‌డెస్క్‌ను నేరుగా సంప్రదించవచ్చని, మిగతా రోజుల్లో 9044115999, 9044117999 సెల్ నంబర్ల ద్వారా అవేర్‌నెస్ కో-ఆర్డినేటర్లతో మాట్లాడాలని పేర్కొన్నారు.



అడ్మిషన్ల విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

# స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్ పెట్టాలి

## ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, వెలుగు:** వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి కొత్తగా ప్రవేశ పెడుతున్న డిగ్రీ కోర్సులు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా ఉన్నాయని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. ఆయా కోర్సులను ఆరు యూనివర్సిటీలు, వివిధ రంగాల నిపుణులతో విస్తృతంగా చర్చించి రూపొందించినట్టు చెప్పారు. బుధవారం మాసబ్ ట్యాంక్ డీఎస్ ఎస్ భవన్ లో బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల ప్రిన్సిపల్స్ కు కొత్త డిగ్రీ కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా విధానంలో మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు నిరంతరం స్కిల్స్ పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డిగ్రీలో కొత్త కోర్సులు విద్యార్థుల ఉపాధి అవకాశాలు పెంచేలా ఉన్నాయని, వాటిని జాగ్రత్తగా బోధించాలన్నారు. కాలేజీలకు పాఠ్యపుస్తకాలు, నిపుణుల సేవలు, అలాగే ఇంటర్న్‌షిప్‌ల కోసం కంపెనీలతో ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకునేందుకు జాబితా అందిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కోర్సుల రూపకల్పనలో టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్షిప్, న్యాయ అంశాలు, పరిశోధన/ఇంటర్న్‌షిప్ అనే నాలుగు ముఖ్య భాగాలను సమన్వయం చేసినట్లు వివరించారు. మారిటైం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, విద్యార్థులను ఆ దిశగా సిద్ధం చేయడం ప్రిన్సిపల్స్ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. రెసిడెన్షియల్



- ఉపాధి అవకాశాలకు అనుగుణంగా కొత్త డిగ్రీ కోర్సులు
- యూనివర్సిటీల వీసీలతో చర్చించి రూపొందించినట్టు వెల్లడి
- కొత్త కోర్సులపై గురుకుల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లకు ట్రైనింగ్

ఇనిస్టిట్యూషన్స్ లో ఇటువంటి కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా ఉంటాయని తెలిపారు. ఇంటరాక్టివ్ సెషన్‌లో ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సందేహాలకు మండలి చైర్మన్ సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ గురుకులాల అకడమిక్ కో ఆర్డినేటర్ సుచిత్ర, ఎస్సీ గురుకుల జాయింట్ సెక్రటరీ శర్మ, మూడు గురుకులాల నుంచి లెక్చరర్లు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత ఐసెట్ మాడ్యూల్

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్ రాయాలనుకునే వారికి ఉచితంగా ఐసెట్ కోచింగ్ మాడ్యూల్‌ను కళాశాల విద్యాశాఖ అందుబాటులోకి తెచ్చింది. ఈ డిజిటల్ వేదికలో అపరిమిత ప్రాక్టీస్ కోసం ప్రశ్నపత్రాలు, పూర్తి స్థాయి గ్రాండ్ టెస్టులుంటాయి. www.ccets.info వెబ్‌సైట్‌లో ఈ మాడ్యూల్ ఉందని, దాన్ని విద్యార్థులు వినియోగించుకునేలా కళాశాలల అధ్యాపకులు అవగాహన కల్పించాలని కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు.